బాబు జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

సమసమాజ స్థాపన కోసం పాటు పడిన డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని, వారి ఆశయాలను సాధించేందుకు కృషి చేయాలని జెఇఒ వీరబ్రహ్మం కోరారు. డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతి వేడుకలను తిరుపతి మహతి కళాక్షేత్రంలో శుక్రవారం నిర్వహించారు. నిమ్నగ కులంలో జన్మించిన బాబు జగ్జీవన్‌రామ్ డబ్బు లేకపోయినా, కులవివక్ష ఎదురైనా వాటిని అధిగమించారని, కష్టపడి చదువుకుని సంఘ సంస్కర్తగా, రాజకీయవేత్తగా ఎదిగి భారత ఉప ప్రధాని పదవిని అలంకరించారన్నారు. డిప్యూటీ ఈవోలు స్నేహలత, దేవేంద్రబాబు పాల్గొన్నారు.

జిల్లా ఎస్‌పి కృష్ణకాంత్ పటేల్ తన క్యాంపు కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఏకధాటిగా 30 ఏళ్ల పాటు క్యాబినెట్ మంత్రిగా పనిచేసిన ఘనత ఆయనకు ఉందన్నారు. 1971లో భారత పాకిస్తాన్ యుద్ధ సమయంలో రక్షణ మంత్రిగా సమర్థవంతంగా పనిచేశారని గుర్తు చేశారు. అదనపు ఎస్‌పిలు వెంకట్రావు, శ్రీనివాసరావు, డిఎస్‌పిలు భాస్కర్‌రెడ్డి, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఎపిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ వివన్ బాబు ఆధ్వర్యంలో డిస్కం కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహించారు. టిటిడి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి చీర్ల కిరణ్, శ్రీహరి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

పాకాలలో కెవిపిఎస్ మండల అధ్యక్షులు నరేంద్ర, ఉపాధ్యక్షులు మధుసూదన్‌రావు సమక్షంలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కులవివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు హరిప్రకాష్, మాజీ ఎంపిటిసి కుమారి, పరదేశి, గోవిందయ్య, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

బిఎన్ కండ్రిగలో సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహ అధికారి సాల్మన్‌రాజ్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఉప ప్రధానిగా, కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా పలు ఉన్నత పదువులు అలంకరించి ప్రజలకు ఎనలేని సేవలు అందించారన్నారు. గూడూరు టౌన్‌లో ఎంపి ఎంఆర్‌పిఎస్ నాయకులు యాళ్లపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆర్ అండ్ బి భవనం పక్కన ఉన్న విగ్రహాల వద్ద చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బిఎస్‌పి నాయకులు భాస్కర్‌గౌడ్, గూడూరు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి చిల్లకూరు వేమయ్య పాల్గొన్నారు.

మైనింగా...మజాకా...!

అయినవారికి ఆకుల్లో... కానివారికి కంచాల్లో...

'మెగా'పైనే దయ.. మిగిలిన వారిపై నిర్దయ

అన్నదాతలకు 'రాయల్టీ' 'మెగా'కు లేదు 'పెనాల్టీ'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

భూగర్భ వనరులను కాపాడటంలో మైనింగ్ శాఖాధికారులది కీలక పాత్ర. పర్యావరణ సమతుల్యత ఏర్పడాలంటే భూగర్భ వనరులు అంతరించిపోకుండా కాపాడటం మైనింగ్ శాఖ విధి. అయితే అందుకు విరుద్ధంగా వ్యవరిస్తున్నారు శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని మైనింగ్‌శాఖాధికారులు. భూగర్భ వనరులు ఎలా అయినా చౌర్యమైపోనీ తమ చేతులు తడిస్తే చాలు అన్న చందాన వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. మరీ ముఖ్యంగా అయిన వారికి ఆకుల్లో..కాని వారికి కంచాల్లో అన్న చందాన పెద్దలకో న్యాయం..సామాన్యులకో న్యాయం అన్న పంథాలో వారి తీరు ఉంటోందని చెప్పుకుంటున్నారు. చేతులు తడిపితే చెరువులకు చెరువులు లోయలు చేసినా అడిగే నాథుడు ఉండడనీ.. తడపకుంటే సొంత భూమిలో మట్టి తీయాలన్నా నిబంధనలు అడ్డు చెప్తాయంటూ మైనింగ్ అధికారులపై ప్రజలు బాహాటంగానే ఆరోపణలు గుప్పిస్తున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో విస్తారమైన ఇసుక, ఎర్ర గుల్ల, మట్టి, మెటల్, కాసిరాయి లాంటి భూ గర్భ నిక్షేపాలున్నాయి. ఈ నిక్షేపాలు నానానిటికీ అంతరించిపోతున్నాయి. కొందరు పరిమితికి మించి క్వారీలు, క్రషర్లు, నదులు, పొలాల్లో తవ్వకాలు జరిపి నిక్షేపాలను తరలించుకుపోతున్నా మైనింగ్‌శాధికారులు అడగరు. సామాన్యుడు యూనిట్ మట్టి, కంకర, ఇసుక తోలుకోవాలన్నా మైనింగ్ శాఖకు రాయల్టీ కట్టాల్సిందే. ఈ లెక్కన మెఘా సంస్థ నాయుడుపేట-మదనపల్లి జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టిన నాటి నుచి నేటి వరకు కొన్ని లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని, ఎర్ర గుల్లను అక్రమంగా తరలించిందన్న ఆరోపణలున్నాయి. మరి మెఘా సంస్థ నుంచి మైనింగ్‌శాఖ ఎన్ని కోట్లు రాయల్టీ రాబట్టిందో చెప్పాలి మరి.

- సొంత భూమిలో మట్టి తీయాలన్నా 'రాయల్టీ'

నియోజకవర్గం వ్యాప్తంగా వందలాది ఇటుక బట్టీలు ఉన్నాయి. ముఖ్యంగా శ్రీకాళహస్తి పట్టణంతో పాటు తొట్టంబేడు మండల వ్యాప్తంగా ఇవి విస్తరించి ఉన్నాయి. ఈ క్రమంలో ఇటుకల తయారీకవసరమైన మట్టిని తమ సమీప రైతుల పొలాల నుంచి, సొంత పొలాల నుంచి సేకరిస్తుంటారు. అయితే ఈ మధ్య కాలంలో మైనింగ్ శాఖాధికారులు ఇలా చేయడం తప్పనీ, యూనిట్ మట్టికి రూ.500 చొప్పున రాయల్టీ చెల్లించి మట్టిని తోలుకోవాలని నిబంధనలు పెడుతున్నారు. దీంతో ముక్కున వేలేసుకోవడం ఇటుక బట్టీల యజమానులు వంతవుతోంది. ఇటుకల తయారీకి తాము వినియోగిస్తున్న మట్టి పూర్తిగా తమ సొంతం, లేకుంటే సమీప రైతుల పొలాల నుంచి తీసుకుంటున్నామనీ, తమ పొలాల్లో మట్టిని తరలించినా మైనింగ్ అధికారులకు పెనాల్టీ కట్టడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఓ మైనింగ్ శాఖాధికారి అయితే నిత్యం ఇటుక బట్టీల చుట్టూ చక్కర్లు కొడుతూ మట్టి తోలుకుంటున్న బట్టీ యజమానులను భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు సమాచారం. మీకు ఆ ప్రజా ప్రతినిధి నుంచి అనుమతి ఉంటే మట్టి తోలుకోండి, లేకుంటే మైనింగ్ శాఖకు రూ.350 నుంచి రూ.500 రాయల్టీ చెల్లించాల్సిందేనంటూ బెదిరిస్తున్నట్లు బట్టీ యజమాని ఒకరు వాపోయారు. తన పాత బట్టీ లీజు కాలం ముగిసిందనీ, కొత్త బట్టీ వద్దకు పాత బట్టీలోని మట్టిని తరలించాలన్నా సదరు అధికారి ట్రాక్టర్‌కు రూ.500 చెల్లించాలని బెదిరించినట్లు సదరు బట్టీ వ్యాపారి తెలిపాడు. ప్రస్తుతం ఇటుక బట్టీల నిర్వహణ కష్టతరమవుతోందనీ, భవన నిర్మాణరంగం కుదేలైన నేపథ్యంలో వ్యాపారంలో నష్టాలు కూడా చవిచూస్తున్నామనీ, ఈ తరుణంలో మైనింగ్‌శాఖాధికారులు ఇలా వ్యవహరించడం ఎంతవరక సబబని ప్రశ్నిస్తున్నారు.

- సామాన్యులు విలవిల

ఇప్పటికే రాష్ట్ర మైనింగ్ శాఖ తీసుకున్న పలు నిర్ణయాల వల్ల ఇసుక బంగారమైపోయింది. ఎర్ర గుల్లదీ అదే పరిస్థితి. ఇక క్రషర్ల వద్ద ఓ ప్రైవేటు కంపెనీ తిష్టవేసి మరీ యూనిట్ కంకర, చిప్స్‌పై ఏకంగా రూ.700 రాయల్టీ వసూలు చేస్తోంది. ఒకప్పుడు ట్రాక్టర్ బాడుగను కలుపుకుని యూనిట్ చిప్స్ ఇంటికి చేరాలంటే కేవలం రూ.2 వేలే అయ్యేది. ఇప్పుడు రూ.4 వేలు లేందే యూనిట్ కంకర కానీ, చిప్స్ గానీ ఇంటికి చేరని పరస్థితి. అదేవిధంగా ఇసుక పరిస్థితి తయారైంది. ఒకప్పుడు యూనిట్ ఇసుక ఇంటికి ఉచితంగా చేరింది. నేడు రూ.3 నుంచి రూ.4 వేలు అవుతోంది. దీంతో సామాన్యులు విలవిల్లాడుతున్నారు. ఇంకో వైపు సొంత అవసరాలకు మట్టిని తోలుకోవాలన్నా మైనింగ్ శాఖ ఆంక్షలు విధిస్తుండటం, పెనాల్టీ కట్టాలని బెదిరిస్తుండటంతో సామాన్యులు, ఇటుక బట్టీ వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది అక్రమార్కుల చేతుల్లో నిత్యం వేల టన్నుల్లో ఇసుక, మట్టి ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయనీ, వాటిని నిలువరించలేని మైనింగ్ అధికారులు సామాన్యులపై ప్రతాపం చూపడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మైనింగ్ శాఖాధికారులు సామాన్యుల పట్ల పారదర్శకంగా వ్యవహరించాలని కోరుతున్నారు.

వామపక్షాలను కలిసిన పోతుగుంట రాజేష్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

సిపిఎం కార్యాలయంలో అంగేరి పుల్లయ్యతో పోతుగుంట రాజేష్

ఇండియా కూటమి శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పోతుగుంట రాజేష్ నాయుడు వామపక్షాల నేతలను వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిసారు. రానున్న ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థి గెలుపుకు అనుసరించాల్సిన కార్యాచరణపై నాయకులు సమాలోచించారు. దేశాన్ని నాశనం చేసిన బీజేపీ, దాని మిత్ర పక్షాలైన టీడీపీ, జనసేన, రాష్ట్రాన్ని నాశనం చేసిన వైసీపీని రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని.. దేశ సమగ్రతను కాపాడే ఇండియా కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో రాజేష్ గెలుపే లక్ష్యంగా వామపక్షాలన్నీ ఒక్కటవుతాయనీ, త్వరలో ఇండియా కూటమి సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎన్నికల్లో ముందుకెళతామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య తెలిపారు. అదేవిధంగా రాజేష్ నాయుడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు డాక్టర్ బత్తెయ్యనాయుడు, అన్నపూర్ణమ్మను మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు కూడగట్టారు.

తిరుపతి అసెంబ్లీ సీపీఐ అభ్యర్థిగా పి.మురళి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి అసెంబ్లీ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అభ్యర్థిగా తిరుపతి జిల్లా కార్యదర్శి పి మురళి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకష్ణ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇండియా కూటమి అభ్యర్థిగా సిపిఎం, కాంగ్రెస్ పార్టీల మద్దతుతో పి.మురళి తిరుపతి అసెంబ్లీ నుండి సిపిఐ అభ్యర్థిగా పోటీ చేస్తారని తెలిపారు. మురళి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శిగా, ఆటో యూనియన్ రాష్ట్ర నాయకులుగా ఉన్నారు. తిరుపతిలో ఆటో, హాకర్స్, బిల్డింగ్,మెడికల్, మున్సిపల్ కార్మికులతో పాటు వీధి విక్రయదారులు సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారు. జిల్లాల పునర్విభజన అనంతరం నూతనంగా ఏర్పడిన తిరుపతి జిల్లాకి సిపిఐ నుండి ప్రథమ జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. లెనిన్ నగర్, ప్రగతి నగర్, వేదాంతపురం, బర్డన్ కాలనీల నిర్మాణంలో క్రియాశీలక పాత్ర వహించి వందలాది మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బిజెపిని, ఆ పార్టీకి కొమ్ము కాస్తున్న వైసిపి, టిడిపి, జనసేన పార్టీలను ఓడించాలని, ఇండియా కూటమి అభ్యర్థిగా తనను గెలిపించాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని మురళి కోరారు. తనను శాసనసభ్యుడిగా గెలిపిస్తే తిరుపతి సమగ్రాభివద్ధికి, కార్మిక పేద ప్రజల గొంతుక అసెంబ్లీలో వినిపిస్తానని తెలిపారు.

భానుప్రకాష్ అంతర్జాతీయ దళారి: అరుణ్ యాదవ్

ప్రజాశక్తి - తిరుపతి(మంగళం)బిజెపి నేత భాను ప్రకాష్ రెడ్డి అంతర్జాతీయ దళారి అని వైసిపి సేవాదళ్ నాయకుడు అరుణ్ యాదవ్ అన్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానాన్ని తన ఉనికిని చాటుకోవడం కోసం వినియోగించుకునే వ్యక్తి భాను అని, తన లేఖలను అధికారులు ఎవరైనా తిరస్కరిస్తే వెంటనే ప్రెస్ మీట్ పెట్టి వారిపై విమర్శలు చేయడం ఆయనకు పరిపాటి అన్నారు. టౌన్ బ్యాంకు వైస్ చైర్మన్ వాసు యాదవ్, పసుపులేటి సురేష్, అనిల్ రెడ్డి, కిరణ్ రాయల్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ఆదేశిస్తే పోటీకి సై' నవీన్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ తిరుపతి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థిగా తనకు అదిస్థానం సంపూర్ణ సహకారంతో అవకాశం ఇస్తే కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకొస్తానని ఆ పార్టీ నాయకులు నవీన్ కుమార్ రెడ్డి దీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతిలో ప్రశాంత వాతావరణం రోజురోజుకూ కనుమరుగై పోతుందన్నారు. రౌడీయిజం, భూకబ్జాలు, అవినీతి అక్రమాలు ఆధ్యాత్మిక నగరంలో వినబడకూడదన్నారు. కాంగ్రెస్‌కు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు అందరం కలసికట్టుగా కష్టపడతామన్నారు. అయితే ఇండియా వేదికలో భాగస్వామి అయిన సిపిఐ తిరుపతి నుంచి బరిలో దిగనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. అయితే నవీన్‌కుమార్‌రెడ్డి తాను సైతం బరిలో ఉన్నానని చెప్పడం గమనార్హం.

ఐదేళ్లలో ఏ ఒక్క అభివృద్ధీ చేయలేదు

టిడిపి తీర్థం పుచ్చుకున్న జడ్‌పిటిసి నంగా పద్మజారెడ్డి

ప్రజాశక్తి - పాకాల

వైఎస్‌ఆర్సిపి సీనియర్ నాయకులు నంగా బాబు రెడ్డి, జడ్పిటిసి నంగా పద్మజా రెడ్డిలు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ హయాంలో ఏ ఒక్క అభివృద్ధి చేయలేకపోయానని వారు వాపోయారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాం నుంచి ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నాయకత్వం వరకూ పార్టీ కోసం కష్టపడినా తగిన గుర్తింపు లేదన్నారు. టిడిపి నుంచి వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌లో చేరిన వారికి మాత్రం ఎక్కువ గుర్తింపు ఇస్తున్నారని, వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌లో సీనియర్ నాయకులుగా ఉన్న తమను మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత గ్రామమైన పంటపల్లిలో శిలాఫలకాలపైన ఏకంగా ప్రోటోకాల్ పాటించలేదని, జడ్‌పిటిసి పేరే లేకుండా పోయిందని అప్పట్లో 'ప్రజాశక్తి' పత్రికలోనూ కథనాలు వచ్చాయన్నారు. ఈ అసంతృప్తితో వారు వెస్ట్ గోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గంలో టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు సమక్షంలో పులివర్తి నాని ఆధ్వర్యంలో టడిపి కండువా కప్పుకున్నారు. పార్టీలో ఉత్సవ విగ్రహాల్లా ఉండలేకే వైసిపికి గుడ్‌బై చెప్పేశామని తెలిపారు. పులివర్తి నానిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని మీడియాకు తెలిపారు.

సాంకేతిక స్వావలంబనతో 'ఆత్మ నిర్భర్ భారత్'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శాస్త్ర సాంకేతిక రంగాల్లో పూర్తిస్థాయి స్వావలంబన సాధించడం వల్ల ఆత్మ నిర్భర్ భారత్ వైపు అడుగులు వేయచ్చని రక్షణ పరిశోధన, వైమానిక శాస్త్ర నిపుణుడు డాక్టర్ జి. సతీష్ రెడ్డి అన్నారు. తిరుపతి ఐఐటీలో 9వ సంస్థ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ సతీష్ రెడ్డి హాజరయ్యారు. తయారీ, గ్రీన్ ఎనర్జీ, ఎనర్జీ స్టోరేజీ వంటి కీలకమైన సాంకేతిక రంగాల్లో పురోగతి అవసరమని ఆయన నొక్కి చెప్పారు. సెన్సార్‌లు, డిటెక్టర్‌లు, లేజర్ డయోడ్‌ల అభివద్ధి జరగాలని పిలుపునిచ్చారు. ఇంకా భారత్ లో కొనసాగుతున్న ఏరోస్పేస్ పరిశోధన, అభివద్ధిపై విద్యార్థులకు వివరించారు. ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

శ్రీరామలో ముగిసిన 'తరంగ్' వేడుకలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని, లక్ష్యాలకు అనుగుణంగా ప్రముఖులు ఇచ్చిన సూచనలు, నత్య ప్రదర్శనలతో శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో తరంగ్ 2024 పేరుతో నిర్వహించిన కళాశాల వార్షికోత్సవం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల అకాడమిక్ డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో విద్యతోపాటు సాంస్కతిక కార్యక్రమాలు మరింత ఉత్తేజాన్ని కలిగిస్తాయని, కళాశాలలో అందుబాటులో ఉన్న వనరులను అందిపుచ్చుకొని మంచి లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. రెండవ రోజు కళాశాల విద్యార్థులు భరతనాట్యం, జానపదం, పౌరాణికం, డిస్కో వంటి వివిధ రకాల నత్య ప్రదర్శనలను చేసి అలరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా పరంపర

ప్రజాశక్తి -కోట తిరుపతి జిల్లా కోట మండలంలోని కోట సచివాలయాలకు చెందిన 8 మంది వాలంటీర్లు శుక్రవారం కోట ఎంపీడీవో శంకరయ్యకు రాజీనామా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కోట మండలంలో కోటలో మూడు సచివాలయాల్లో 48మంది వాలంటీర్లు ఉండగా ఇప్పటివరకు 33 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. అదేవిధంగా కొత్తపట్నం పంచాయతీ సచివాలయంలో కూడా 14 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. ఇప్పటివరకు మండల స్థాయిలో 46 మంది వాలంటీర్లు రాజీనామా చేసినట్లు కోట ఎంపీడీవో శంకరయ్య తెలియజేశారు.

టిటిడి ఆధ్వర్యంలో తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరుమల

ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు భక్తులందరికీ శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలను టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి తెలిపారు. శుక్రవారం కాల్ యువర్ ఈవో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టిటిడి ఆధ్వర్యంలో తొలిసారిగా ముద్రించిన తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వచ్చే వారం నుంచి భక్తులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఏప్రిల్ 9న ఉగాది పర్వదినం పురస్కరించుకుని టిటిడి ఆస్థాన పండితులు ఆస్థానం, పంచాంగ శ్రవణం నిర్వహిస్తారన్నారు. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, చెన్నయ్, బెంగుళూరులోని టిటిడి సమాచార కేంద్రాల్లోనూ పంచాంగం అందుబాటులో ఉంటుందన్నారు. తిరుపతి పరిపాలనా భవనంలో కాల్ యువర్ ఈవో కార్యక్రమం జరిగింది. 29 మంది భక్తులు 38 సమస్యలను ఫోన్ ద్వారా ఈవోకు తెలియజేశారు.

'బలిజ అభ్యర్థులకే మా మద్దతు '

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రాయలసీమ జిల్లాలలో కూటమి పార్టీలలో బలిజ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు మద్దతుగా నిలుస్తామని రాయలసీమ బలిజ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు వెలిశెట్టి శ్రీహరి రాయల్ స్పష్టం చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో నూతనంగా తిరుపతి జిల్లా కమిటీని ప్రకటించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో బలిజలకు తగిన గుర్తింపు లేక పోయిందన్నారు. రాయలసీమ ప్రాంతంలో ఉన్న బలిజల ఐక్యత కోసం రాయలసీమ బలిజ మహాసభ పనిచేస్తుందని తెలిపారు. తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా నారాయణరావు, కార్యదర్శిగా పెంచలయ్య, జిల్లా యువజన కార్యదర్శిగా చిన్నంగారి గోపాలకష్ణ, సత్యవేడు యువజన అధ్యక్షులుగా గోల్కొండ విక్రం రాయల్ ను నియమిస్తున్నట్లు తెలిపారు.

ఉద్యోగులకు వృత్తి నైపుణ్య శిక్షణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

తిరుపతి జూ పార్కు మార్గంలో గల స్టేట్ ఇన్స్ స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ న్యూట్రిషన్ లో తిరుపతి నగర పరిధిలోని కౌటిల్య ఇన్స్ స్టిట్యూట్ వారిచే ఉద్యోగులకు రెండు రోజుల వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కౌటిల్య ఇన్స్ స్టిట్యూట్ డైరెక్టర్ శ్రీధర్, ఎస్ ఎస్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులలో ముఖ్యంగా జవాబుదారీతనంతో పని చేయడానికి అవసరమైన వాతావరణాన్ని ఉద్యోగ ప్రదేశాల్లో తోటి ఉద్యోగులతో ఎలా మెలగాలి, నాయకత్వ పెంపు, టీం వర్క్, డిజిటల్ నైపుణ్యత, ఆతిథ్యం, వృత్తి నైపుణ్యం వంటి అంశాలు చాలా కీలకమైనవి అన్నారు. ప్రతి ఉద్యోగి తన బాధ్యత పట్ల కచ్చితత్వంతో వ్యవహరిస్తే మంచి ఫలితాలను సాధించవచ్చున్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రమణ ప్రసాద్ మాట్లడుతూ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కాలేజీ మరింత అభివద్ధి చెయ్యడానికి, తమ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. సంస్థ అభివద్ధిలో ఉద్యోగుల భాగస్వామ్యం చాలా కీలకమైనదని, భాగస్వామ్య పటిష్టతకు తీసుకోవలసిన మెలుకువలను పాటిస్తున్నామన్నారు.

'బ్యాంక్ వారు మోసం చేశారు'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోవనూరు బ్రాంచ్ బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం ఓ ఖాతాదారురాలుకు శాపంగా మారింది. బాధితురాలి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తొట్టంబేడు మండలం ఎగువ సాంబయ్యపాలెం గ్రామానికి చెందిన కే.మంజుల ఏప్రిల్ 4వ తేదీ(గురువారం)న తమ కుటుంబ అవసరాల నిమిత్తం తన వద్దనున్న 216 గ్రాముల బంగారు నగలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోవనూరు బ్రాంచ్ నందు తాకట్టు పెట్టింది. అందుకోసం బ్యాంక్ అధికారులు రూ 8.50 లక్షలు నగదును బ్యాంకులోని 2వ కౌంటర్ నుండి లబ్ధిదారులు మంజుల కు అందించారు. బ్యాంకు అధికారులు అందించిన నగదులో రూ 500 ల సీల్డ్ కట్టలు 16, రూ 100 ల సీల్డ్ కట్టలు 5 ఇచ్చారు. ఈ మొత్తాన్నిసదరు క్యాషియర్ మిషన్ ద్వారా లెక్క చేయకుండానే లబ్ధిదారులకు ఇచ్చేశారు. ఆ నగదును ఇంటికి తీసుకెళ్లి లెక్కచేయగా రూ 500ల నోట్ల కట్టల్లోని 5 కట్టల్లో రూ 1500 లు చొప్పున తక్కువగా వచ్చింది . ఈ విషయాన్ని బ్యాంక్ అధికారులకు తెలియజేయుటకు మరుసటి రోజే 5వ తేది (శుక్రవారం) నగదు తక్కువ వచ్చిన రెండు కట్టలు బ్యాంకుకు తీసుకువెళ్లి బ్యాంక్ అధికారుల సమక్షంలో లెక్కచేయగా రూ.1500 చొప్పున తక్కువ వచ్చినట్లు బ్యాంకు అధికారులు గుర్తించారు. ఇలా మొత్తం 5 కట్టల్లో రూ.7500 లు లబ్ధిదారు నష్టపోయింది . అయినప్పటికీ బ్యాంక్ అధికారులు ఏమాత్రం కనికరించక పోగా, తమ సిబ్బంది తప్పిదాన్ని కప్పిపుచ్చుకుంటూ లబ్ధిదారులదే తప్పు అని బుకాయించిన పరిస్థితి నెలకొంది. పోలీసులకు ఫిర్యాదు చేసుకోండి అని బ్యాంకు మేనేజర్ ఉచిత సలహా ఇవ్వడంతో లబ్దిదారు లబోదిబోమంటూ మీడియాను ఆశ్రయించింది.

ఆకట్టుకున్న సంకీర్తనల గోష్ఠిగానం

ప్రజాశక్తి - తిరుమల

శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల 521వ వర్ధంతి మహోత్సవాలు టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిరంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఆలపించిన సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానం ఆకట్టుకుంది.రాజంపేట - కడప హైవేలో ఉన్న 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద శుక్రవారం సాయంత్రం 6.30 నుండి రాత్రి 8 గంటల వరకూ మణి బృందం అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. తిరుపతికి చెందిన వెంకట కృష్ణయ్య బృందం హరికథ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టుసంచాలకులు డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ పాల్గొన్నారు.

భక్తులకు శరణాగతి నేర్పిన అన్నమయ్య : డాక్టర్ రవి కుమార్

భగవంతుని తత్వాన్ని తెలుసుకునేందుకు శరణాగతి తప్ప మరో మార్గం లేదని భక్తులకు అన్నమయ్య తెలియజేశారని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ పేర్కొన్నారు. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల 521వ వర్ధంతి ఉత్సవాల్లో భాగంగా తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో శుక్రవారం సాహితీ సదస్సులు ప్రారంభమయ్యాయి. సదస్సుకు అధ్యక్షత వహించిన డాక్టర్ రవి కుమార్ "అన్నమయ్య - యోగ సంకీర్తనలు" అనే అంశంపై ఉపన్యసిస్తూ, ప్రసిద్ధ శ్రీవైష్ణవాచార్యులు భగవద్ రామానుజులు తెలియజేసిన అష్టాక్షరి మంత్రాన్ని అన్నమయ్య తన సంకీర్తనల ద్వారా శ్రీ వైష్ణవ ధర్మాన్ని, భక్తి తత్వాన్ని ప్రచారం చేసినట్టు తెలిపారు. నరసాపురానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త డా.రామారావు 'అన్నమయ్య - భావుకత' అనే అంశంపై ఉపన్యసించారు. తెలుగు అధ్యాపకులు శ్రీరాములు వాగ్గేయకారులు - అన్నమయ్య ప్రత్యేకతను వివరించారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టుసంచాలకులు డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

రంజాన్ తోఫాను పంపిణీ చేస్తున్న దాతలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ ను పురస్కరించుకొని 60 మంది పేద ముస్లింలకు రంజాన్ తోఫాను శుక్రవారం అందించారు. దాతలు లలిత బ్రాండ్ వెంకటేశ్వర్లు, నారాయణ ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ దాతల సహకారం మరువలేనిదన్నారు. తమ సంస్థ ద్వారా భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ సెక్రెటరీ చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, ఇబ్రహీం, రషీద్, రసూల్, కార్యవర్గ సభ్యులు పిడి కరిముల్లా, ఎం రాఘయ్య, వాచ్ షాప్ రామ, పిల్లల శీను, పోతి రెడ్డి పెంచలయ్య, సంధి మునిప్రసాద్, నారాయణ, నాగరాజు, కృష్ణా రెడ్డి, తూపిలి యశ్వంత్ పాల్గొన్నారు.

ఏపీఆర్‌సెట్ ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - క్యాంపస్ : ఏపీ ఆర్ సెట్ 2023-24 ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదల చేసినట్లు కన్వీనర్ ఆచార్య బి.దేవప్రసాద్ రాజు శుక్రవారం వెల్లడించారు. మే 2 వ తేదీ నుంచి 5 వ తేదీ వరకూ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4.30 గంటల వరకూ రెండు దశలుగా పరీక్షలు వుంటాయని తెలిపారు. ఈ నెల 10 వ తేదీ నుంచి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వెబ్ సైట్ నుంచి హాల్ టికెట్లు పొందవచ్చని సూచించారు. రాష్ట్రంలోని ఎంపిక చేసిన 14 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు 10 వేల మంది పైగా అభ్యర్థులు హాజరయ్యే అవకాశం ఉన్నట్లు ప్రొఫెసర్ దేవప్రసాదరాజు వివరించారు. విద్యార్థులు సకాలంలో హాల్‌టికెట్లు తీసుకుని పరీక్ష కేంద్రానికి చేరుకుని ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని ఆకాంక్షించారు.

జగన్ ప్రభుత్వ హయాంలో బిసిలకు అన్యాయం

- చిత్తూరు పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు షణ్ముగ రెడ్డి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : జగన్ ప్రభుత్వ హయాంలో బిసిలకు తీరని అన్యాయం ఎదురైందని చిత్తూరు పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగం రెడ్డి పేర్కొన్నారు. నగరి నియోజకవర్గం, క్లస్టర్ 4 బీసీ మహాసభ పుత్తూరు మండల టిడిపి కార్యాలయంలో పుత్తూరు పట్టణ అధ్యక్షుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ గాలి జీవరత్నం నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన టీడీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగ రెడ్డి మాట్లాడుతూ జగన్ పాలనలో బీసీలు దగాకు గురయ్యారన్నారు. బీసీలను ఎన్టీఆర్, చంద్రబాబు కుటుంబ సభ్యులుగా చూస్తే జగన్ రెడ్డి బానిసలుగా చూస్తున్నాడని విమర్శించారు. టీడీపీ పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు ప్రసంగించారు. ఈ సమావేశంలో టిడిపి పుత్తూరు పట్టణ పార్టీ ప్రధానకార్యదర్శి ఎస్ఎన్ ధనపాల్, పుత్తూరు మున్సిపల్ మాజీ ఛైర్మన్ బిజార్యుగంధర్, ఐటీడీపీ కోఆర్డినేటర్ ఈశ్వర్ యాదవ్, సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.

టిడిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని కుందకూరు, నెర్నూరు గ్రామాల్లో టీడీపీ కూటమి అభ్యర్థి పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తమ మ్యానిఫెస్టోలోని పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి , 30 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వారికి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి నెలబల్లి భాస్కర్ రెడ్డి, కొండూరు వెంకటేశ్వర్లు రాజు, దుద్దా రాఘవ రెడ్డి,రాధాకృష్ణ రెడ్డి, అల్లూరు కరుణాకర్ రెడ్డి, మట్టం శ్రావని రెడ్డి, యల్లసిరి శ్రీనివాసులు రెడ్డి, పల్లంపర్తి మధురెడ్డి, లక్కు కృష్ణా రెడ్డి, ముమ్మడి అమరేంద్ర, మారుబోయిన దామోదర్ పాల్గొన్నారు.

రామచంద్రాపురం : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని ఆదరించాలని కోరుతూ టిడిపి యువనేత పులివర్తి వినిల్ మండలంలోని చుట్టుగుంట , రామాపురం పంచాయతీ దిగువ రామాపురం, ఏ, ఏ డబ్ల్యు, హెచ్ డబ్ల్యు కాలనీలలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అమలు చేయనున్న పథకాలను ఓటర్లకు కరపత్రాల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎం తిరుమలరెడ్డి, సి జనార్ధన్ చౌదరి, ఈ ఉమాపతి నాయుడు, కె నరసింహారెడ్డి, సి రవి కుమార్, కె రామిరెడ్డి, కే ధనంజయ రెడ్డి, కే గిరిధర్ రెడ్డి, హరి ప్రసాద్, కే మధుసూదన్ రెడ్డి, బి మధుసూదన్ రాయల్, బండి విజయ్ కుమార్ రెడ్డి, వై సుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రత్యేక ప్రతిభావంతులకు శుక్రవారం నిత్యా వసర సరుకులు పంపిణీ చేశారు. గూడూరు పట్టణంలోని త్యాగరాజా వీధి లోని శ్రీ కళ్యాణ వీరభద్రస్వామి ఆలయంలో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్, ఆంధ్ర మహిళా మండలి సహకారంతో 37 మంది పేద వికలాంగులకు నిత్యావసర వస్తువు లు అందించారు. ఆ సంస్థ సభ్యురాలు జెట్టి పవిత్ర, సురేంద్ర రెడ్డిలు అందించిన ఐదు వేల రూపాయలు ఆర్థిక సాయంతో నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు విష్ణు వందన , మహిళ మండలి అధ్యక్షురాలు జమున, స్నేహలత, లక్ష్మి, అనిత, రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్ , శ్రీనివాస ఆచారి , వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జేబీఎన్పీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నిరంజన్ రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జై భారత్ నేషనల్ పార్టీ శ్రీకాళహస్తి అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పెద్ద కన్నలి గ్రామానికి చెందిన నిరంజన్ రెడ్డిని అధిష్టానం ప్రకటించింది. ఆ పార్టీ అధినేత జేడీ లక్ష్మీ నారాయణ శుక్రవారం ఆ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల అధికారిక మొదటి జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాలో నిరంజన్ రెడ్డికి స్థానం దక్కడం గమనార్హం. జేఎన్బీపీలో నిరంజన్‌కు టిక్కెట్టు రావడంపై ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

సంతోష్ కుమార్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ : కనమ నంబేడు గ్రామానికి చెందిన కణమనంపేట సంతోష్ కుమార్ ను నెల్లూరు ప్రాచీన విశిష్ట అధ్యాయన కేంద్రం వారు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఉగాది కవి సమ్మేళనంలో పాల్గొని ఉగాది పండుగ విశిష్టతను గురించి వివరించారు. ఆయన ప్రతిభను గుర్తించి నెల్లూరు ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం సంస్థకు చెందిన డైరెక్టర్ మాడ బూసి కుమార్, సంస్థ సిబ్బంది సన్మానించి గౌరవ పురస్కారం అందించారు.

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి -రామచంద్రాపురం: తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం పంచాయతీ యానాది కాలనీకి చెందిన 30కుటుంబాలు వైసిపిలో చేరాయి. శుక్రవారం సి.మల్లవరంలో దామరపాటి ప్రేమ కుమార్, మల్లారపు వాసు, మల్లారపు వెంకటరమణ, సిద్ధారెడ్డి ఆధ్వర్యంలో తుడా ఛైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సమక్షంలో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు నివాళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద బాబు జగ్జీవన్‌రామ్ సిపిఎం ఆధ్వర్యంలోచిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పుత్తూరు మండల కార్యదర్శి ఆర్ వెంకటేష్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ దళితుల హక్కుల కోసం, దళిత మహిళల కోసం పోరాటాలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పురుషోత్తం, సిఐటియు నాయకులు ప్రవీణ్ కుమార్, రమేష్, రామలింగం, ధనంజయులు, ఏ రమేష్ పాల్గొన్నారు.

ఎక్సరే మిషన్ లేక ఇక్కట్లు..!

- మధ్యాహ్నం తర్వాత కనిపించని వైద్యులు - ఫ్రాక్చర్‌లతో వచ్చే వారికి వైద్యం కరువు - ఇదీ కోట ప్రభుత్వ ఆస్పత్రి దుస్థితి

ప్రజాశక్తి -కోట : ఎక్సరే మిషన్ లేకపోవడంతో ఫ్రాక్చర్ అయి వైద్యం కోసం వచ్చిన వారు నిరాశతో వెనుదిరుగుతున్నారు. గతంలో ప్రభుత్వ ఆస్పత్రిలో ఎంతో మెరుగ్గా వుండేది. ప్రస్తుతం మధ్యాహ్నం తర్వాత వైద్యులు కంటికి కూడా కనిపించడంలేదు. దీనిపై పై స్థాయి అధికారులు స్పందించడంలేదు. దీంతో వైద్యం అసలు అందుతుందా? లేదా? అని ప్రజలు ఎదురు చూసి అయోమయంలో పడాల్సిన దుస్థితి కోట ప్రభుత్వ ఆస్పత్రిలో నెలకొంది..

ఫ్రాక్చర్ అయితే ఎక్సరే తీసుకునే పరిస్థితి లేదు..

రోగులకు ఏదైనా కాలు, చేయో ఫ్రాక్చర్ అయితే ఈకోట ప్రభుత ఆస్పత్రిలో తక్షణమే ఎక్సరే తీసుకునే పరిస్థితి కనిపించడంలేదు. ఇలాంటి ఎక్సరేలు తీసుకోవాలంటే బయట ఎక్సరే మిషన్ లకు వెళ్లాల్సి వస్తోంది. కోట మండలంలోని కోట ప్రభుత్వ ఆసుపత్రిని ఇటీవలే కోట్ల రూపాయలు వెచ్చించి నూతనంగా ఆసుపత్రి భవనాన్ని ఆధునికంగా నిర్మించారు. అయినా ఎలాంటి ఉపయోగం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా చిన్న ఫ్రాక్చర్ అయ్యి కోట ప్రభుత్వ ఆసుపత్రి కి వెళితే రేడియోగ్రాఫర్ (ఎక్సరే మిషన్)లేకపోవడంతో అనేక మంది పెషెంట్ లు వెనుదిరగక తప్పడం లేదని చెబుతున్నారు. దీనికి తోడు ఇంకొక విచిత్రమైన విషయం ఏమిటంటే ఆసుపత్రి లో రేడియోగ్రాఫర్ (ఎక్సరే మిషన్) లేనప్పటికి రేడియోగ్రాఫ్ మెన్ ఉద్యోగి ఉంటూ నెలకు 20 వేల రూపాయలు జీతం తీసుకుంటున్నాడు. రోజూ వస్తాడు... పోతాడు అంతే నెలకు జీతం తీసుకుంటున్నారు. అయితే ఎంతోమంది పెషెంట్ లు వచ్చి డాక్టర్ లు వద్ద చూపించుకుని ఏదో తూతూమంత్రంగా మందులు తీసుకుని వెనుదిరగాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. కొంతమంది అయితే బయటకు వెళ్లి వంద రూపాయలు వెచ్చించి ఎక్సరేలు తీసుకుని వస్తున్నామని అంటున్నారు.

మధ్యాహ్నం తర్వాత కనిపించని వైద్యులు

గతంలో కోట ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు ఏ సమయంలో వెళ్లినా అందుబాటులో వుండేవారు. ప్రస్తుతం మధ్యాహ్నం దాటిన తర్వాత వైద్యులు అందుబాటులో వుండడం లేదని పలువురు రోగులు వాపోతున్నారు. వైద్యులు కనిపించకపోవడంతో నిరాశతో వెనుదిరిగా రావాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నీ వసతులు ఉన్నప్పటికీ ఎక్సరే మిషన్లు లేకపోవడంతో ఎంతోమంది రోగులు ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్లి అత్యధికంగా డబ్బులు ఖర్చు పెట్టుకుని ఇంటికి వెళుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పై స్థాయి అధికారులు స్పందించి తక్షణమే కోట ప్రభుత్వ ఆస్పత్రిలో రేడియోగ్రాఫర్ (ఎక్సరే మిషన్) ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎస్వీయూలో నూతన సంవత్సర ఉగాది సమ్మేళనం

ప్రజాశక్తి - క్యాంపస్ : రావే.. రావే క్రోధి నామ సంవత్సర ఉగాదీ.. అంటూ బహుభాషా కవి సమ్మేళనం అద్యంతమూ ఆకట్టుకుంది. ఈతరం కవిత వేదిక - ఎస్వీయూ తెలుగు విభాగం సంయుక్తంగా క్రోధి నామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనం శుక్రవారం నిర్వహించాయి. తెలుగు భాగంలోని ఆచార్య జీఎన్ రెడ్డి సెమినార్ హాల్లో ఈ కార్యక్రమం సాగింది. ఎస్వీయూ తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ కవి సమ్మేళనంలో పీజీ పీహెచ్.డీ విద్యార్థులు, అధ్యాపకులు, సాహిత్యాభిమానులు కవితా పఠనం చేశారు. తెలుగు, తమిళం, ఉర్దూ భాషల్లో కవితా పఠనం జరిగింది. ఈ సందర్భంగా తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ మాట్లాడుతూ.. తెలుగు భాషా సాహిత్యాలకు తెలుగు విభాగం ఎంతో కృషి చేసిందన్నారు. తెలుగు భాషా సాహిత్యాలను ప్రచారం చేయడానికి ధర్మనిధి సదస్సులు, వర్క్ షాప్ లు, కవి సమ్మేళనాలు వంటి కార్యక్రమాలను చేపడుతున్నట్టు చెప్పారు. సలహాదారు ఆచార్య పేట శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. తెలుగు భాగంలో చదువుకున్న విద్యార్థులు అనేక మంది కవులుగా కూడా మంచి గుర్తింపు పొందారని తెలిపారు. నిరంతర సాధనతో మంచి కవిత్వాన్ని రాయడానికి విద్యార్థులు ప్రయత్నం చేయాలని కోరారు. ఈతరం కవిత వేదిక గౌరవాధ్యక్షులు ఆచార్య ఎస్జీడీ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. శ్రీ శ్రీ రాసిన మహాప్రస్థానం, తిలక్ రాసిన అమతం కురిసిన రాత్రి పుస్తకాలను కవిత్వాభిమానులు విద్యార్థులు తప్పక చదవాలని సూచించారు. ఈతరం కవితా వేదిక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కవులనూ కవిత్వాన్నీ ప్రోత్సహించడానికి ఈ తరం వేదిక అనేక సాహిత్య కార్యక్రమాలను నిర్వహించిందనీ, భవిష్యత్తులోనూ నిర్వహిస్తుందని చెప్పారు. ఆచార్య మేడిపల్లి రవికుమార్ మాట్లాడుతూ.. పండుగ నేపథ్యంలో నుంచి ప్రాపంచిక సమస్యలపై కవిత్వం రాసే నైపుణ్యాన్ని విద్యార్థులు పెంపొందించుకోవాలని కోరారు. విద్యార్థుల కవితా పఠనం అందరినీ ఆకట్టుకుంది.

యథేచ్ఛగా మట్టి తరలింపు

- అడ్డుకున్న టిడిపి నాయకురాలు, గ్రామస్తులు,
- అభివృద్ధికి ఐక్య పోరాటానికి సిద్ధమన్న సుష్మారెడ్డి

మట్టిని అడ్డుకుంటున్న టిడిపి నాయకురాలు సుష్మారెడ్డి, గ్రామస్తులు

ప్రజాశక్తి -కోట: కోట మండలంలోని తిన్నెలపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకన్నపాలెం నుండి తిన్నెలపూడి గ్రామానికి వెళ్లే సీసీ రోడ్డు పక్కనే మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. శుక్రవారం వెంకన్నపాలెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మట్టిని జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో తొలగిస్తున్న సమాచారం సీనియర్ టిడిపి నాయకురాలు గండవరం సుష్మా రెడ్డి, సుధీర్ రెడ్డి తెలుసుకున్నారు. వెంటనే తిన్నెలపూడి గ్రామస్థులతో కలిసి వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రోడ్డు పక్కనే మట్టిని తొలగిస్తున్న వెంకన్నపాలెం గ్రామానికి చెందిన ఆ వ్యక్తిని నిలదీశారు. మట్టి తీసుకెళుతున్న ఆ వ్యక్తి తాను తప్పు చేయలేదని ఘర్షణకు దిగాడు. ఆగ్రహించిన తిన్నెలపూడి గ్రామస్తులు ఆ మట్టిని రోడ్డుకి అడ్డంగా పోసివేసి అడ్డుకున్నారు. జేసీబీ సాయంతో మట్టిని ఎక్కువగా తొలగించడంతో పక్కనే వున్న విద్యుత్ స్తంభాలు కూలి పోయే ప్రమాదంలో వున్నాయని గ్రామస్థులు వాపోయారు. ఈ సందర్భంగా సుష్మా రెడ్డి మాటాడుతూ పార్టీలకు అతీతంగా తిన్నెలపూడి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సంఘటన గ్రామ సమస్య కావడంతో పరిష్కరించడానికి వెంటనే తాను ఇక్కడికి వచ్చానని తెలిపారు. వెంకన్నపాలెం నుండి తిన్నెలపూడి గ్రామానికి వెళ్లడానికి రోడ్డును గతంలో తమ తండ్రి గండవరం రవీంద్రా రెడ్డి ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గండవరం సుష్మా రెడ్డి, సుధీర్ రెడ్డి, తిన్నెలపూడి గ్రామస్థులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ఇండస్ట్రీయల్ ఇన్‌స్పెక్టర్ శివ శంకర్ రెడ్డి

మాక్ డ్రిల్ ద్వారా అగ్ని ప్రమాదాలను నివారణ తీరును వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి - ఓజిలి : అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా వుండాలని ఇండస్ట్రీయల్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని జాతీయ రహదారి వద్ద ఉన్న ఏజీ అండ్ పి గ్యాస్ స్టేషన్ వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలు తప్పని సరిగా ఉండాలన్నారు. పరిశ్రమలో జరిగే అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన లోపంతో ఆర్థిక అభివృద్ధికి శాపంగా మారుతోందన్నారు. అగ్ని ప్రమాదం జరిగితే ఏజీ అండ్‌పి సంస్థ తక్షణం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. గ్యాస్ ట్యాంకర్ టిప్పర్ ఢీ కుంటే తక్షణం తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై ఆయన సెక్యూరిటీ విభాగాలకు వివరించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారులు అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఎలాంటి తక్షణ చర్యలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శ్యాంబాబు, తడ రిలయన్స్ గ్యాస్ ప్రతినిధి మురుగన్, ఏజీ అండ్ పి సంస్థ ప్రతినిధులు అంబరీష్ బాబు,రీజనల్ హెడ్ గౌతమ్ ఆనంద్, డిప్యూటీ రీజనల్ హెడ్ అనీల్ కుమార్, వోఅండ్ ఎం మేనేజర్ దేవేందర్ సిరిసిల్ల, సేఫ్టీ మేనేజర్ శబరి బాబు, అసెట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వంశీ రెడ్డి, విగ్నేష్, ఓజిలి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'హిమజ'లో రోబోటిక్ టింకరింగ్ ల్యాబ్ ప్రారంభం

రోబోటిక్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న సురేంద్రరాజు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణ పరిధిలోని ప్రముఖ విద్యా సంస్థ హిమజ పాఠశాలలో టింకరింగ్ రోబోటిక్ ల్యాబ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి రీజినల్ సైన్స్ కో ఆర్డినేటర్ కోలా శ్రీనివాస నెహ్రూ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా హిమజ పాఠశాల ఛైర్మన్ సురేంద్ర రాజు అతనికి శాలువాతో జ్ఞాపికను అందజేసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రోబోటిక్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో పిల్లలు వివిధ రకాలుగా తయారు చేసిన రోబోటిక్ యంత్రాలు, గాలిలో ఎగిరే విమానాలు, బ్యాటరీ సెల్‌తో నడిచే చిన్నచిన్న రోబోటిక్ యంత్రాలు 3డి ప్రింటర్ సాయంతో డిజైన్ చేసుకునే కళాకృతులు, గాలిలో ఎగిరే డ్రోన్‌లు అక్కడికి విచ్చేసిన వారిని ఎంతో ఆకట్టుకున్నాయి. విద్యార్థులు వారు తయారుచేసిన వాటి వివరాలను చక్కగా వివరిస్తుంటే అతను ఆసక్తిగా తిలకించారు. తర్వాత నెహ్రూ మాట్లాడుతూ హిమజా పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనడం తనకు చాలా సంతోషకరంగా వుందన్నారు. పిల్లల భవిష్యత్తు పట్ల సైన్స్ పరిజ్ఞానాన్ని పెంపొందించడంలో హిమజ పాఠశాల అన్నిట్లో ముందంజలో ఉంటుం దన్నారు. పాఠశాల ఛైర్మన్ సురేంద్ర రాజు మాట్లాడుతూ జిల్లాలోని మన పాఠశాలలో మాత్రం ప్రత్యేకంగా రోబోటిక్ ల్యాబ్‌ని ఏర్పాటు చేశామని ఈ పాఠశాలలో చదువుకునే అందరూ సైన్స్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి , మేధస్సుకి ఈ రోబోటిక్ టింకరింగ్ ల్యాబ్ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు ఈ ఎగ్జిబిషన్‌ని పలువురు పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల యాజమాన్యం, సిబ్బంది, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్ :రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు అయిపోయి నెల కూడా గడవక పరీక్షల ఫలితాలు విడుదల కాకుండానే విద్యార్థులను పీడించుకొని మానసికంగా హింసిస్తున్న కార్పొరేట్, ప్రయివేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పవన్, సుభాన్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం కెటీ రోడ్డులోని కార్పొరేట్ విద్యా సంస్థలలో నిబంధనలకు విరుద్ధంగా సెకండ్ ఇయర్ విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్న కళాశాలలో ఎస్ఎఫ్ఐగా అడ్డుకొని విద్యార్థులను ఇళ్లకు పంపించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నేతలు మాట్లాడుతూ ఇంటర్ బోర్డ్ సూచనలు ప్రకారం జూన్ వరకు ఎలాంటి కోచింగ్‌లు, తరగతులు నిర్వహించొద్దని స్పష్టంగా జిఓ లు ఇచ్చిన కార్పొరేట్ విద్యా సంస్థలకు మాత్రం లెక్కలేకుండా అప్పుడే సెకండ్ ఇయర్ తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులకు సెలవులు లేకుండా ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రవేటు విద్యా సంస్థలలో తరగతులు జరుతున్నా తిరుపతి ఆర్ఐఓ మాత్రం కళ్ళు మూసుకొని ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తూ కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఆర్ఐఓ స్పందించి నిబంధనలు పాటించని కళాశాలలను సీజ్ చేసి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో తరగతులను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అడ్డుకుని రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చైతు, గణేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

వైద్య విద్యార్థి అనుమానాస్పద మృతి

మోక్ష మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: వైద్య విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన శుక్రవారం తిరుపతిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... పద్మావతి మహిళ వైద్య కళాశాలలో మూడవ సంవత్సరం అభ్యసిస్తున్న కె మోక్ష(22) ఎస్వి యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రతాప్ అపార్టుమెంట్లో నివాసం ఉంటోం ది. అనారోగ్యంతో బాధ పడు తున్న మోక్ష ఇంటిలో నిద్రిస్తూ ఉలుకు పలుకు లేకపోవడంతో గమనించిన తల్లి 108 వాహనంలో స్విమ్స్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. అధిక మోతాదులో మందులు వేసుకోవడం వల్ల మృతి చెందినట్లు కుటుం బ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసు లు ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థి తండ్రి బాబ్జి ఫిర్యాదు మేరకు ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి -కోట : అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా శనివారం గుర్తించి బాటిళ్లతో పాటూ బైక్‌ను కూడా పట్టుకున్నట్లు కోట ఎస్ఐ పి నాగబాబు పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు..కోట మండలం గూడలి పంచాయతీ పరిధిలో ని ప్రకాశం కాలనీకి చెందిన తోటకూర మునిరత్నం అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా తాము గుర్తించి 50 మద్యం బాటిళ్లతో పాటూ ఒక బైక్ ను స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకునేందుకు కృషి చేసిన వారిలో పోలీసు సిబ్బంది కార్తీక్ ఉన్నారని పేర్కొన్నారు.

ఘర్షణ.. పలువురికి గాయాలు

ప్రజాశక్తి -రామచంద్రాపురం : మండలంలోని నెమ్మల్లగుంటపల్లి గ్రామంలో ఇరు గ్రూపుల మధ్య శుక్రవారం ఘర్షణ చోటుచేసుకుని పలువురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు..శుక్రవారం ఉదయం ఉదయం 6 గంటలకు కామసాని దొరమ్మ ఇంటి ముందు చెత్త ఊడ్చుతుండగా కొంత చెత్త పక్కింటి సుందరమ్మ ఇంటి ముందు పడిందని దొరమ్మను సుందరమ్మ, ధనమ్మలు ' మా ఇంటి ముందు చెత్త ఎలా పడేస్తావు?' అని నానా దుర్భాషలాడారు. దీంతో దొరమ్మ భర్త కె కొండారెడ్డి ' మీ ఇంటి ముందు పడిన చెత్తను తీసేస్తాం..'అని చెప్పినా వినకుండా సుందరమ్మ కుటుంబ సభ్యులు కొండారెడ్డి, దొరమలపై వాగ్వివాదానికి దిగారు. ఈ నేపథ్యంలో దొరమ్మ, కొండారెడ్డిలపై దాడి చేస్తుండగా కె నవీన్, రూపేష్, చిన్నక్క, ఈశ్వరమ్మలు దాడిని అడ్డుకునేందుకు వెళ్లారు. ఇంతలో సుందరమ్మ కుటుంబ సభ్యులు కే కొండారెడ్డి, కే దొరమ్మ, ఈశ్వరమ్మ, నవీన్, చిన్నక్కల మధ్య ఘర్షణ మొదలైంది. ఈ ఘర్షణలో కొండారెడ్డి కుటుంబ సభ్యులకు పలుచోట్ల గాయాలు అయ్యాయి. వారిని వైద్యం నిమిత్తం 108 లో తిరుపతి రుయాకు తరలించారు. తిరుపతి రుయా ఆసుపత్రిలో క్షతగాత్రులు వైద్య చికిత్సలు పొందుతున్నారు.

'ప్రమాద బీమా' బాండ్లు అందజేత

ప్రజాశక్తి-తిరుతి డెస్క్: భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద బీమా బాండ్ల ను భారతి సిమెంట్ టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్ ఛాయాపతి శనివారం అందించారు. కేవిబి పురం మండల కేంద్రంలో భారత్ సిమెంట్ డీలర్, టిఎస్ఆర్ సిమెంట్ యజమాని అనిల్ కుమార్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్ సిమెంట్ మేనేజర్ ఛాయాపతి మాట్లాడుతూ నమ్మకానికి, నాణ్యతకు మారుపేరు భారతి సిమెంట్ అన్నారు. జర్మన్ టెక్నాలజీ రోబోటిక్ క్వాలిటీ కంట్రోల్ ఇంజనీరింగ్ నిపుణుల పర్యవేక్షణలో అత్యుత్తమ ప్రమాణాలతో ఉత్పత్తి అవుతూ మార్కెట్‌లో భారత్ సిమెంట్ అందరి మన్ననలు పొందుతూ అగ్రగామిగా నిలిచిందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు అండగా భారత్ సిమెంట్ నిలుస్తోందన్నారు. ప్రతి భవన నిర్మాణ కార్మికుడికి ఉచితంగా లక్ష రూపాయలు ప్రమాద బీమాను భారత్ సిమెంట్ అందిస్తోందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద బీమా బాండ్లను ఈ సందర్భంగా వారు అందించారు.

ముస్లింలకు మిఠాయిలు పంపిణీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ముస్లిం సోదరులకు ఎమ్మెల్సీ, రష్ అధినేత డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం శుక్రవారం మిఠాయిలు పంచిపెట్టారు. ముస్లింలకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పర్వ దినాన్ని ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షిం చారు. రాష్ట్రంలోని ముస్లింలకు జగన్ ప్రభుత్వం అండగా నిలబడుతోందన్నారు. శ్రీకాళహస్తి నియోజక వర్గంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పేద ముస్లింలకు అన్ని తానై నిలబడ్డ తీరును ఈ సందర్భంగా కొనియాడారు. ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ప్రత్యేక ఆహ్వానితుడు కంతా ఉదయ్, వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నాయకుడు లక్ష్మీపతి మృతి

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: కెవిబిపురం మండలంలోని సిద్ధమనాయుడు కండ్రిగ గ్రామ పంచాయతీకి చెందిన టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మీపతి మృతి టిడిపికి తీరని లోటు అని ఆ పార్టీ మండల అధ్యక్షులు రామాంజులు నాయుడు శుక్రవారం పేర్కొన్నారు. వారి కుటుంబానికి టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలం సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మీపతి పార్టీకి ఎంతో కృషి చేశారని పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటున్న వ్యక్తి మన మధ్య లేకపోవడం బాధాకరం అన్నారు. వారి కుటుంబానికి పార్టీ అండగా వుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి టిడిపి పార్లమెంటు యువత అధికార ప్రతినిధి అవసరం సురేష్ రెడ్డి, మాజీ యంపిపి సుబ్రహ్మణ్యం, వాణిజ్య విభాగం అధ్యక్షులు చంద్రయ్య నాయుడు, బీసీ సెల్ అధ్యక్షులు రామచంద్రయ్య, యువత అధ్యక్షులు ముని కుమార్ యాదవ్, మాజీ సర్పంచ్‌లు చెంగారెడ్డి, వెంకటేష్, గోవిందరాజులు నివాళులు అర్పించారు.

వైసిపి నాయకుల సమావేశం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో నియోజక వర్గ కోఆర్డినేటర్ చేవూరు విజయమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మండల జేసీయస్ కోఆర్డినేటర్స్ శుక్రవారం విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి విజయానికి కృషి చేయాలని కోరారు. అనంతరం బూత్ కమిటీల నిర్వహణ గురించి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కె.రాఘవరెడ్డి, మోహ్సిన్ బాషా, సి రాజశేఖర్, వై సుధాకర్ నాయుడు, ఎస్ శ్రీహరి, వి మనోజ్ రెడ్డి, సనత్ కుమార్, కాంద్ర నారాయణరెడ్డి , వాయుగుండ్ల నాగరాజు పాల్గొన్నారు.

IN THE COURT OF THE V ADDL. DISTRICT JUDGE, TIRUPATI.
IA 432, 435 and 436 / 2023
OS No. 86 / 2017
M.S. Rukumini & Others - *Petitioner / Plaintiff*
Vs.
P. Paunyavathi (Died) & Others - *Respondents.*

NOTICE TO THE RESPONDENTS NO. 22 TO 24

22) M. Anitha W/o Late M. Madhava Reddy, **23)** M. Chaitanya, S/o Late M. Madhava Reddy, **24)** M. Poojitha, D/o Late M. Madhava Reddy, D.No. 13-6-721/A, Peddakapu Layout, Tirupati.

పై కనిన దావాలోని ఎల్.ఆర్. పిటీషనర్‌లో రెస్పాండెంటు నెం. 22 నుండి 24 వరకు నోటీసు నిమిత్తం తేది 29-04-2024న ఉదయం 10.30 గం॥లకు పై కనిన రెస్పాండెంటు నెం. 22 నుండి 24లు పై కనిన కోర్టులో హాజరై సమాదానం చెప్పు కోవలసినదిగా కోర్టు వారు వాయిదా వేసియున్నారు. రాని యెడల పరోక్షముగా తీర్మానించబడును.
ఇట్లు వాయిదా తేది 29-04-2024
శ్రీ పి. ప్రభాకర నాయుడు, అడ్వకేట్, తిరుపతి.

IN THE COURT OF THE V ADDL. DISTRICT JUDGE, TIRUPATI.
IA 431, 433 and 434 / 2023
OS No. 86 / 2017
M.S. Rukumini & Others - *Petitioner / Plaintiff*
Vs.
P. Paunyavathi (Died) & Others - *Respondents.*

NOTICE TO THE RESPONDENTS NO. 21

21) P. Swathi, D/o Late P. Punyavathi.Flat No. 404, Minakshi Towers, STV Nagar, Annamaiah Marg, Tirupati

పై కనిన దావాలోని ఎల్.ఆర్. పిటీషనర్‌లో రెస్పాండెంటు నెం. 21కు నోటీసు నిమిత్తం తేది 29-04-2024న ఉదయం 10.30 గం॥లకు పై కనిన రెస్పాండెంటు నెం. 21 పై కనిన కోర్టులో హాజరై సమాదానం చెప్పు కోవలసినదిగా కోర్టు వారు వాయిదా వేసియున్నారు. రాని యెడల పరోక్షముగా తీర్మానించబడును.
ఇట్లు వాయిదా తేది 29-04-2024
శ్రీ పి. ప్రభాకర నాయుడు, అడ్వకేట్, తిరుపతి.

Before The Deputy Registrar of Chits/Arbitrator, Tirupati
ARC No.12/2023
M/s Margadarsi Chit fund Pvt. Ltd., Tirupati
Rep by its Manager/Foreman ...Disputant
V/s
Ms. M.D.Indumathi & Others ...Opponents
Notice to Opponents 5 & 7
Opp5) Radha Babu Haritha W/o Mallamgunta Vijaya Kumar a/a 35 Years, W/as S.G.Teacher, MPP School, Raghavarajapuram Village, S.R.Puram Mandal, Tirupati Dist. Pin: 517167. (Residing ar D.No.1-226, Old Bhajana Koil Street, Nagari, Chittoor Dist. Pin: 517590)
Opp7) Chettipalle Sumithra Reddy, W/o Muthyala Hari a/a 58 Years, W/as School Assistant (Biology), M.P.U.P.School, Eguvakanakampalem Village, Puttur Mandal, Chittoor Dist. Now: Tirupati Dist. Pin: 517583. (Residing at H.No.13-48/1, Jandamanu street Extension, Puttur, Chittoor Dist. Now: Tirupati Dist. Pin: 517583)
Please take Noitce that the above Dispute is posted to **27.04.2024** for your appearance before the above said Honorable District Registrar/ Arbitrator office, Tirupati at 10.30 A.M either in person or through an Advocate and Raise your obections if any. Failing which the case will be decided in your absence, as exparte.
Hg Date: 27.04.2024
K.RAMESH BABU
Advocate, Tirupati. Cell: 94400 95932

Before The Deputy Registrar of Chits/Arbitrator, Tirupati
ARC No.16/2023
M/s Margadarsi Chit fund Pvt. Ltd., Tirupati
Rep by its Manager/Foreman ...Disputant
V/s
Ms. A.Bharathi & Others ...Opponents
Notice to Opponents 7 & 8
Opp7) Sompalli Raghavulu S/o S.Sanjeevaiah Naidu, a/a 45 Years, Survey No.326/3, Sivasai Decorticator premises, Ilaganur Village Thottambedu Mandal, Chittoor Dist. Now: Tirupati Dist.-517642 (Business Address as Sivasai Mini Flour Mill & Groundnut Decorticating, Ilaganur Village, Chittoor Dist., Now: Tirupati Dist.)
Opp8) Sompalli Nadiya W/o S.Raghavulu, a/a 36 Years, Survey No.326/3, Sivasai Decorticator premises, Ilaganur Village Thottambedu Mandal, Chittoor Dist. Now: Tirupati Dist.-517642 (Business Address as Sivasai Mini Flour Mill & Groundnut Decorticating, Ilaganur Village, Chittoor Dist., Now: Tirupati Dist.)
Please take Noitce that the above Dispute is posted to **27.04.2024** for your appearance before the above said Honorable District Registrar/ Arbitrator office, Tirupati at 10.30 A.M either in person or through an Advocate and Raise your obections if any. Failing which the case will be decided in your absence, as exparte.
Hg Date: 27.04.2024
K.RAMESH BABU
Advocate, Tirupati. Cell: 94400 95932

శ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, గూడూరులో
I.P.No.35/2022
Gindi Rohini Kumar ... **Petitioner**
Vs
1. Kattamreddy Revathi and 4 others ...**Respondents**
To
1. Kattamreddy Revathi, W/o. Late Kattamreddy Mani Reddy, Palachuru Village and Post, Pellakuru Mandal, Tirupati District. Cell: 9949068318, 9390445010.
2. Kattamreddy Vijayalakshmi, D/o. Late Katamreddy Mani Reddy, Palachuru Village and Post, Pellakuru Mandal, Tirupati District. Cell: 9949068318, 9390445010.
3. Kattamreddy Kavitha, D/o. Late Katamreddy Mani Reddy, Palachuru Village and Post, Pellakuru Mandal, Tirupati District. Cell: 9949068318, 9390445010.

నోటీసు
ఇందుమూలముగా పై తెలిపిన రెస్పాడెంట్స్‌కు తెలియజేయుట ఏమనగా I.P. లోని పిటిషనర్ రెస్పాడెంట్స్ మీద ఋణదాత దివాలా పిటిషన్ వేసియున్నారు. పై I.P. మీ నోటీసుకు గాను తేది: 23.04.2024 దీకు వాయిదా వేసియున్నారు. కావున ఆరోజు మీరు ఉ॥ 10:30 ని॥ పై కోర్టులో హాజరు అయి మీ సంజాయిషీ తెలుపుకోనేది లేని యెడల మీ పరోక్షముగా తీర్మానించబడును.
ఇట్లు,
యం.సోమశేఖర్, B.Sc., B.L.,
అడ్వకేట్, నాయుడుపేట

మహారాజశ్రీ ప్రకాశం జిల్లా ప్రధాన జిల్లా జడ్జి వారి కోర్టు ఒంగోలు
IA NO : 973/2020
AS NO : /2020
Between
పల్లప్రోలు మల్లిఖార్జున రెడ్డి మరియు 2ఇతరులు ..... పిటిషనర్స్/ అప్పిలెంట్స్
మరియు
మాలెంపాటి శేషారావు మరియు 6 ఇతరులు .... రెస్పాండెంట్స్
To
3వ రెస్పాండెంట్ చిరునామా
పసుపులేటి రాంబాబు, S/o వెంకటేశ్వర్లు,
D.NO:19-12-383, బైరాగి పట్టెడ,
తిరుపతి (అర్బన్), బాలాజీ జిల్లా, ఏ.పీ.
పై తెలుపబడిన అప్పీలునందు, అప్పీలు దాఖలు చేయడంలో ఆలస్యమైనందున ఆలస్యము మన్నించుటకు తగు కారణములతో పిటిషన్ దాఖలు చేయగా IA No: 973/2020 గా ఇచ్చి రెస్పాండెంట్స్ న కు నోటీసులు పంపుటకు శ్రీ కోర్టు వారు ఆర్డర్ వేసియున్నారు. 3 వ రెస్పాండెంట్ న కు పలుమార్లు నోటీసులు శ్రీ కోర్టు వారి ద్వారా పంపియున్ననూ జారీ కానందున పేపరు ప్రకటన ద్వారా నోటీసు జారీ చేయుటకు ఆర్డర్ వేసియున్నారు. కావున ఈ పేపర్ ప్రకటనను 3వ రెస్పాండెంట్ నోటీసుగా భావించి తేది:23-04-2024 నా ఉదయంగం10:30 ని.లకు శ్రీ కోర్టు వారి సమక్షంలో స్వయంగా గాని లేదా వకీల్ ద్వారా గాని హాజరు కావలెను లేనిచో మీ పరోక్షముగా తీర్మానింపబడుదురు.
// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
ఒంగోలు
తేది : 05.04.2024
ఇట్లు
పిట్టల లక్ష్మయ్య
బి.నాగేశ్వరరావు
అడ్వకేట్స్, ఒంగోలు
సెల్ : 9848835099